www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 02 జులై 2024
5
తూర్పుగోదావరి



కాపవరం ఎత్తిపోతల నుంచి నీరు విడుదల



ప్రజాశక్తి - సీతానగరం

కాపవరం ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని విడుదల చేశారు. రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. మండలంలో మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల రైతులకు ఈ సాగునీరు ఉపయుక్తంగా ఉంటుంది. సీతానగరం మండలంలో 2,815 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని నిర్మించారు. ఈ పథకం ద్వారా పూర్తి స్థాయిలో నీరందితే 1,142 రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ కార్యక్రమంలో ఆయకట్టు రైతులు కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌ను నిర్వీర్యం చేశారు

- వైసిపి సర్కారుపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విమర్శ
- పిఠాపురంలో పింఛన్ల పంపిణీ, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి



చెక్కును అందిస్తున్న పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

గత వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేశారని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. సోమవారం ఆయన పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సాయంత్రం జనసైనికులు, వీరమహిళలతో సమావేశమయ్యారు. పింఛన్ల పంపిణీ అనంతరం నిర్వహించిన సభళో ఆయన మాట్లాడారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో విమర్శలు, ప్రతివిమర్శలు చేశామని, ఇప్పుడు పాలనపైనే దృష్టి పెడతామన్నారు. పంచాయతీరాజ్ నిధులు ఏమయ్యాయో అంతుపట్టని విధంగా ఉందన్నారు. అప్పులు పేరుకుపోయాయన్నారు. తన వైపు నుంచి అవినీతికి తావుండదని, దీనికి తగినట్లుగా అధికారులు పని చేయాలన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉంటే రూ.600 కోట్లు ఖర్చుపెట్టి రుషికొండను తవ్వేసి మరీ రాజమహల్ కట్టారన్నారు. ఈ సొమ్ముతో ఓ జిల్లాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయొచ్చన్నారు. కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకం నిధులను సైతం గత ప్రభుత్వం వినియోగించుకోలేక పోయిందన్నారు. ఫలితంగా గోదావరి చెంతనే ఉన్నా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. తమ ప్రభుత్వంలో అద్భుతాలు జరుగుతాయని చెప్పలేను గాని, ప్రభుత్వంలో ఏ జరుగుతుందో సామాన్యుడికి అర్థం అయ్యేలా పాలన ఉంటుందన్నారు. జవాబుదారీ పాలన అందిస్తామన్నారు. పిఠాపురాన్ని ప్రపంచం చూసే స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. మొదటి మోడల్ గ్రామాన్ని ఈ నియోజకవర్గంలోనే తీర్చిదిద్దుతానన్నారు. వాలంటీర్లు లేకపోతే పనులు కావని చెప్పారని, అయితే నేడు వాలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో వరుస తనిఖీలు చేస్తున్నప్పుడు బయటపడుతున్న అక్రమ రేషన్ బియ్యం నిల్వలను ప్రజలు చూశారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు బాధ్యులకు శిక్ష పడాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 2,79,319 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.188 కోట్ల 39 లక్షల, 60 వేలను పింఛన్లుగా అందంచామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ, ఎస్‌పి సతీష్ కుమార్, మాజీ ఎంఎల్ఎ వర్మ, డిఆర్‌డిఒ పీడీ కె.శ్రీరమణి, డిఎంహెచ్‌ఒ జె.నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులకు కతజ్ఞతా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఠాపురం ప్రజలు దేశ చరిత్రను తిప్పగలిగిన, లిఖించదగిన విజయం అందిచారన్నారు. కడ వరకు ప్రజల కోసమే పని చేస్తానని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో లోపాలను సరిచేయాలంటే అధికారులు సహకరించాలన్నారు. శేషాచలం అడవుల్లో లభించే ఎర్రచందనం కొట్టివేసి ఆ దుంగలను వైసిపి హయాంలో దేశం దాటించి నేపాల్‌లో దొరికిపోయారన్నారు. ఆ ఫైల్ తన ముందుకు వచ్చిందన్నారు వైసిపిలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. 2019లో కాలం వైసిపికి 151 సీట్లు ఇచ్చి పరీక్ష పెట్టిందన్నారు. ఆ పరీక్షకు వారు తట్టుకోలేకపోయారన్నారు. అన్నింటికీ తాము అతీతులం అనేలా ప్రవర్తించారన్నారు. దీంతో కాలం పెట్టిన పరీక్షలో వారు ఓడిపోయారన్నారు. గనులు, ఇసుక, అడవులు ఇలా సహజ సంపదలన్నీ వైసిపి హయాంలో దోపిడికీ గురయ్యాయన్నారు. తనకు ప్రతి రోజూ ప్రతి గంటా కీలకమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఐదేళ్ల పాటు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. జనసేనకు వంద శాతం స్ట్రయికింగ్ రేట్ పార్టీగా పేరొచ్చిందన్నారు. కష్టపడే కార్యకర్తలను ప్రతి ఒక్కరినీ గుర్తించాలని సూచించానన్నారు. పిఠాపురం అభివద్ధి, అభ్యున్నతి కోసం నిరంతరం తాపత్రయపడతానన్నారు. ఆఖరి శ్వాస వరకు దాని కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, పిఠాపురం నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



డయేరియా బాధితులకు స్థానికంగా వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపురంలో డయేరియా కలవరం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో డయేరియా ప్రబలింది. కోమటికుంట, గుడ్డిగూడెం గ్రామాల్లో డయేరియా కలవరం రేపింది. గుడ్డిగూడెంలోని ఓ ప్రయివేటు కర్మాగారంలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన ఆరుగురు కార్మికులు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. అతిసార లక్షణాలు కనిపించడంతో తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గాయత్రి తెలిపారు. అందులో ఒక వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడ నుంచి రాజమండ్రికి తరలించామని డాక్టర్ చైతన్యరాజు తెలిపారు. శనివారం రాత్రి కోమటికుంటలో ఒక మహిళకు వాంతులు విరోచనాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. అప్రమత్తమైన అన్నదేవరపేట పిహెచ్‌సి వైద్యులు స్వర్ణలత కోమటికుంట గ్రామంలో వైద్య సిబ్బందితో సర్వే చేయించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ప్రస్తుతం అందరిపరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలి

ప్రజాశక్తి - రాజానగరం

అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో జడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ప్రత్యేక హోదాపై శాసనసభలో తీర్మాణం చేయాలని జడ్‌పిటిసి ఈ సందర్భ:గా ఎంఎల్‌కు వినతిపత్రం అందించారు. ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని కలవచర్ల సర్పంచ్ పిల్లా రాజబాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రజా ప్రజాప్రతినిధులు విధులకు ఆటంకం కలిగించారని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో తమ విధులకు ఆటంకం కలిగించకుండా ఉంటే నిందింతులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడారు. గ్రామాల్లో చోరీలు ఎక్కువయ్యాయని, రాత్రివేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. రాజమండ్రి నుండి కొత్తతుంగపాడు, కోరుకొండ నుండి ముగ్గళ రూట్లలో బస్సులు వేయాలని ఆర్‌టిసి అధికారులను కోరారు. తన నుంచి ఎటువంటి వేధింపులు, ఇబ్బందులు, సిఫార్సులు ఉండవని అధికారులు సక్రమంగా పనులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు మండారపు సత్యవతి, ఉపాధ్యక్షులు కొల్లి సత్య, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కె.వెంకన్న, ఎంపిడిఒ జ్యోతిర్మయి, మండల ప్రత్యేక అధికారి బాలస్వామి, తహశీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

చట్టాల్లో కొత్త మార్పులు వచ్చాయని వాటిని అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని దేవరపల్లి సిఐ బాలసురేష్‌బాబు తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెంలో కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 511 సెక్షన్లు ఉన్నాయని వాటిని 350 సెక్షన్లకు కుదించారన్నారు. మారుతున్న కాలానికి అనుకూలంగా కొత్త చట్టాలను ఏర్పాటు చేశారన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయం అనే కొత్త చట్టాలు ఇక నుంచి అమలవుతాయన్నారు. వాటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో గొడవలు, దాడులు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రమేష్ కె.మోహన్‌చౌదరి, ఎం.శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో పండుగలా నిర్వహించారు. ఒకటి రెండు చోట్ల సర్వర్ల మొరాయింపుతో ఇబ్బందులు తలెత్తడంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరంలో ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు, రాజమహేంద్రవరం రూరల్‌లో హుకుంపేటలో ఎంఎల్ఎ బుచ్చియ్యచౌదరి పింఛన్లను పంపిణీ చేశారు. **పెరవలి** మండలం తీపర్రులో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఆయనకు నాయకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆయన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పింఛన్లు అందించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రవి వర్మ, టిడివి, జనసేన మండల అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్ పాల్గొన్నారు. **నల్లజర్ల** మండలం అనంతపల్లిలో మాజీ ఎంపిపి జమ్ముల వీరవెంకటసతీష్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీని నిర్వహించారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు పుట్టినరోజు సందర్భంగా కేకు కట చేయించారు. పసుమర్తి రతీష్, వై.బ్రహ్మరాజు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు. **సీతానగరంలో** ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. కూటమి నాయకులు పల్గొన్నారు. **రాజానగరం** నియోజకవర్గంలో 39,777 మందికి రూ.26.67 కోట్ల పింఛన్లు అందించామని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో నందరాడ, రాజానగరంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెసి తేజ్‌భర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలో గోపాలపురం, వేళ్ల చింతలగూడెం, వెదుళ్లకుంట, వెంకటాయపాలెం తదితర గ్రామాలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. గోపాలపురంలో పెంకె మహాలక్ష్మి అనే వృద్ధురాలు పింఛను అందట్లేదని, తనకు పింఛను ఇప్పించాలని ఎంఎల్ఎ వద్ద మొరపెట్టుకుంది. నాయకులు సౌజన్యంతో రూ.7వేలను ఆమెకు ఎంఎలఎ ద్వారా అందించారు. ఆమెకు పింఛను అందించాలని అధికారులను ఆదేశించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల .సువర్ణరాజు, టిడిపి నాయకులుకొర్లపాటి అన్నవరం, విల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** మండలం రంప ఎర్రంపాలెంలో టిడిపి రైతు అధికార ప్రతినిధి ఉంగరాల రాము ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. పలుగ్రామాల్లో నిర్వహించిన పంపిణీలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో 96 శాతం పింఛన్లను పంపిణీ చేశామని మండల పరిషత్ అధికారి కె.నరేంద్రరెడ్డి తెలిపారు. కొద్ది సేపు సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. మధ్యాహ్నం నాటికి సర్వర్లు పనిచేయడంతో పంపిణీ జరిగింది. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మండలంలోని వేలివెన్ను, పసలపూడి, సూర్యారావుపాలెం, సత్యవాడ, రెడ్డి చెరువు, తాడిపర్రు, వెలగదుర్రు, తదితర గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. **కడియం** మండలంలోని పలు సచివాలయాల్లో కూటమి నేతలతో కలిసి ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి, జెసి తేజ్ భరత్ పింఛన్లను పంపిణీ చేశారు.



పెరవలిలో పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

మండంలో 91.23 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ బి.రమాదేవి, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, అనసూరి గోవిందు, వనం సూరిబాబు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని పైడిమెట్ట, పెద్దేవంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పింఛన్లన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, కొవ్వూరు దసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కె.రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. **చాగల్లు** చాగల్లు మండలంలో టిడిపి నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తెలుగు యువత నాయకులు నాదెళ్ల నాని, కరుటూరి సతీష్, దొంగ రామకృష్ణ, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు. చాలా చోట్ల సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీ మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. మండలంలో 97 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.



రాజమండ్రి వెళ్లి పింఛను పంపిణీ

చాగల్లు : తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం నేలటూరుకు చెందిన అంగారపు సురేష్ తీవ్ర అనారోగ్యంతో గురవ్వడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకుని సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి దీప్తి నేరుగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆయనకు రూ.7వేలు పింఛను అందించింది. ఈ సందర్భంగా దీప్తిని స్థానిక నాయకులు, అధికారులు అభినందించారు.



గోకవరం మండలంలో పింఛను అందిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ



గోపాలపురంలో పింఛను అందిస్తున్న ఎంఎల్ఎ మద్దింశెట్టి వెంకట్రాజు




రాజమహేంద్రవరంలో పింఛను అందిస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు



సీతానగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బత్తుల తదితరులు

కార్టూ'నిజం'



రైతు సమస్యల పరిష్కారంలో వైసిపి నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాళ్లపూడి

రైతు సమస్యలను పరిష్కరించడంలో వైసిపి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పైడిమెట్ల ఎత్తిపోతల పథకానికి నూతనంగా ఏర్పాటు అయిన కమిటీ సమావేశం సోమవారం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాగునీరు అందించడానికి ఎత్తిపోతల పథకాలు నిర్మించిన ఘనత టిడిపి దేనన్నారు. ఈ ప్రాంత రైతుల సమస్యలు తెలుసుకుని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. నీటి తీరువా బకాయిలు చెల్లించి కొత్త పాలకవర్గానికి సహకరిస్తూ ఎత్తిపోతల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీధర్, ఎత్తిపోతల పథకం నూతన అధ్యక్షులు ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, నియోజకవర్గ దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కె.రామకృష్ణ, కొవ్వూరు మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర, టిడిపి మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాంప్రసాద్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మూడున్నర దశాబ్దాలుగా ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది, ఉద్యోగ విరమణ చేసిన కోట రాంప్రసాద్ పలువురికి ఆదర్శనీయంగా నిలిచారని ఉండ్రాజవరం మల్లిన వెంకట నరసమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మాణిక్యాలరావు అన్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కోట రాంప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా రాంప్రసాద్, వరలక్ష్మి దంపతులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఉండ్రాజవరం జూనియర్ మహిళా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కారయక్రమంలో మాణిక్యాలరావు మాట్లాడారు. ఉపాధ్యాయునిగానే కాకుండా నటునిగా రాంప్రసాద్ పేరు గాంచారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రాంప్రసాద్ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



రాంప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం తదితరులు

'సింగరాజు'ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉపాధ్యాయ సమస్యల నిర్మూలన కోసం నిరంతర పోరాటం చేసిన సింగరాజు రామకృష్ణయ్య ఉద్యమ స్ఫూర్తిని నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు అన్నారు. సింగరాజు జయంతిని సోమవారం మండలంలోని గజ్జరం ఉన్నత పాఠశాల నిర్వహించారు. తొలుత సింగరాజు చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు దుర్గారావు మాట్లాడుతూ సింగరాజు జీవిత విశేషాలను వివరించారు. ఉపాధ్యాయ ఉద్యమంలో ఆయన పాత్రను, సమస్యల నిర్మూలనకు ఆయన చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు పి.రఘువీరశాస్త్రి, హెచ్‌ఎం జి.మోహన్, ఉపాధ్యాయులు కె.ప్రసాదరావు, ఖాదర్, కాత్యాయని, రవికుమార్, రేవతి పాల్గొన్నారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులతో చదవడం, రాయించడంపై ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాదాఖాధికారి ఇవివిబిఎన్.నారాయణ అన్నారు. స్థానిక బైపాస్ రోడ్‌లో గల సిమ్మెటరీపేట ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. కొందరితో పదాలు చదివించారు. 1వ తరగతి విద్యార్థులతో చేయిస్తున్న విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూని తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట హెచ్ స్వర్ణలత ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. దీనికి సంబంధించి ముమ్మిడివరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని నక్కావారి పేటకు చెందిన కుంచే చిరంజీవి (34)కి కొంతకాలం క్రితం పుష్పతో వివాహం అయ్యింది. ఇటీవల ఆమె ఉపాధి కోసం కువైట్ వెళ్ళింది. అక్కడ పని చేసి పంపిన డబ్బును దుబారా చేస్తున్నాడని చిరంజీవికి ఆమెకు మాటా మాటా పెరిగింది. దీంతో శనివారం రాత్రి పురుగు మందు తాగాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. ముమ్మిడివరం ఎఎస్ఐ ఎస్.జాన్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలపై సోమవారం అమలాపురం ఆదిత్య పాఠశాల ప్రాంగణంలో పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ పి.వీరబాబు, ఎస్ఐ శేఖర్ బాబు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ శేషుబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-కొత్తపేట

స్థానిక శ్రావణ నర్సింగ్ హోమ్ చిన్నంరాజు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కాసిన గేయానంద శేషు బాబును బిజెపి రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్ శేషుబాబు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాలాటి మాధవ స్వామి, గొలకోటి వెంకటేశ్వరరావు, కోటిపల్లి దామోదర్, కిరణ్, అన్యం సత్యనారాయణ, ఎస్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

భారత న్యాయ వ్యవస్థను సంస్కరించే దిశగా కేంద్రం ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత బిల్లును ప్రవేశపెట్టిందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని నగరం ఎస్ఐ పివిఎస్ఎస్ఎన్.సురేష్ అన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై సోమవారం నగరం పోలీసు స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 150 ఏళ్ల క్రితం నాటి చట్టాల్లో కొన్ని మార్పులు చేసి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి రావడంతో ఇకనుండి కొన్ని నేరాలకు సత్వరమే కఠిన శిక్షలు పడతాయని, కాబట్టి ప్రజలు అందరూ గమనించాలని సూచించారు.

విద్యార్థుల భవితకు ఉపాధ్యాయులే దిక్సూచి

ప్రజాశక్తి -మామిడి కుదురు

విద్యార్థుల భవిష్యత్తు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని పలువురు కొనియాడారు. ఆదుర్రు హైస్కూల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చప్పిడి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఇరుకు రెడ్డి పంతులు పాల్గొన్నారు.

మహిళలకు పని ప్రదేశంలో భద్రత

ప్రజాశక్తి-అమలాపురం

మహిళలకు పని చేసే ప్రదేశంలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడారు. పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా అరికట్టే దిశలో మహిళల రక్షణ కమిటీ ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ '14, 15 హెచ్' ప్రకారం లింగ సమానత్వం కోసం స్త్రీల ప్రాథమిక హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే హక్కు ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా మహిళలు సురక్షితమైన వాతావరణ హక్కును కలిగి ఉన్నారన్నారు. దీనిలో భాగంగా మహిళలు స్వేచ్ఛగా భద్రత కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం లేదా వ్యాపారాన్ని నిర్వహించడానికి అనువైన వాతావరణంఉండేలా చూడాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందన్నారు.

'స్టాప్ డయేరియా' ప్రారంభం

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రామచంద్రపురం డయేరియా అదుపు మన చేతుల్లోనే ఉందని వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఆమె ఆరోగ్య శాఖతో కలిపి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వెల్ల గ్రామంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. **అమలాపురం రూరల్** మండలం గున్నేపల్లి హెల్త్ సెంటర్లో సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు అధ్యక్షతన డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డివి.సత్యం మాట్లాడుతూ డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గున్నేపల్లి గ్రామపెద్దలు పి.శ్రీరామ్మూర్తి, డి.సుబ్రమణ్యం, ఎన్.ఏడుకొండలు, పి.రామకృష్ణ పాల్గొన్నారు. **ఆత్రేయపురం** ఆరోగ్యకర సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం పిహెచ్‌సిలో డయేరియా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, సిహెచ్ఒ అరుణ కుమారి, సూర్యనారాయణ, విజయభాను పాల్గొన్నారు. **ముమ్మిడివరం** డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యోగితా లక్ష్మి అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ, స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఫార్మసిస్ట్ సత్యనారాయణ పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** అంగర పిహెచ్‌సి పరిధిలోని పడమర ఖండ్రికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంఎల్ హెచ్‌పి.దేవి పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలానికి చెందిన కాండ్రకోట పిహెచ్‌సి పరిధిలోని 12 గ్రామాల్లో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారులు బి.చంద్రకిరణ్‌బాబు, ప్రియదర్శిని తెలిపారు. సోమవారం గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ గవరసాన శివరామకృష్ణ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొరుసు రాజు, జి.బాబు, ఉల్లింకల నూకరాజు, ప్రెసిడెంట్ మాకిరెడ్డి చిన్ని, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని రమణయ్యపేట గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాంబాబునాయక్ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి పాల్గొని మాట్లాడారు. డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, మండల టిడిపి అధ్యక్షుడు చదరం చంటిబాబు, టిడిపి నాయకులు తూము కుమార్, తోట గాంధీ, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలానికి చెందిన లింగంపర్తి గ్రామంలో అతిసారపై అవగాహన సదస్సును ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అధికారులు పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, చిక్కాల లక్ష్మణరావు, ఎస్‌జివి.సుబ్బరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలానికి చెందిన ములగపూడిలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపిటిసి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ములగపూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌందర్య సూచించారు. కలుషిత నీరు తాగడంతోపాటు, ఆహారం తీసుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే అతిసార బారిన పడే అవకాశాలు ఉన్నాయని వివరించారు. **సామర్లకోట** మండలానికి చెందిన హుస్సేన్‌పురం గ్రామంలో డయోరియాపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం, పంచాయతీ సెక్రెటరీ, డ్వాక్రా సంఘాల యానిమేటర్స్ మరియు ఆశా వర్కర్లు, మరియు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలానికి చెందిన పండూరు పిహెచ్‌సిలో డయేరియాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొన్నారు. గ్రామంలో డయోరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **జగ్గంపేట** జగ్గంపేటలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డివిజన్ అదనపు వైద్య ఆరోగ్య అధికారిణి సరిత స్టాప్ డయోరియా కార్యక్రమంపై అవగాహన కల్పించారు.



ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వెంకటాయపాలెం సర్పంచ్ సతీష్ కుమారి

యానాం వార్తలు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పి రాజశేఖరన్

నూతన నేరచట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన నేర చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌పి రాజశేఖరన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గాశ్రీనివాస్ మాట్లాడుతూ మూడు కొత్తచట్టాలైన భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్షిత సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అమలులోకి వచ్చాయన్నారు. ఎస్‌పి రాజశేఖరన్ మాట్లాడుతూ బాలల దోపిడీపై కఠినచర్యలు, యాసిడ్ దాడులకు చట్టపరమైన నిబంధనలు, సమగ్ర క్రిమినల్ ప్రొసీడింగ్స్, ఎఫ్ఐఆర్ నమోదులో సమయపాలన, అత్యాచార బాధితులకు వైద్యపరీక్షల నివేదికలు, బాధితుడు, ఇన్‌ఫార్మర్ల దర్యాప్తుల స్థితిగతులు, త్వరితగతిన అభియోగాల రూపకల్పన తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురుగానందన్, శేరు నూకరాజు, జిల్లెల్ల ప్రభాకరరావు, రిటైర్డ్ సిఐ గూటం శివగణేష్, ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు, నాయకులు గుత్తుల రామారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి - యానాం

యానాంలో డాక్టర్స్‌డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్య నర్సింగ్ హోం డాక్టర్ కాకర్లపూడి వీరేశ్వరవర్మను లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ సభ్యులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ సభ్యుడిగా ఉంటూ ఫిజియోథెరపీ డాక్టర్‌గా సేవలందిస్తున్న ఉయ్యూరు చరణ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పులవర్తి శ్రీను, బెజవాడ నిరంజన్, కనకాల నరసింహమూర్తి, నల్లం సురేష్, నామా గోపి, కనకాల సుబ్రహ్మణ్యం, కంచుమూర్తి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం



మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్‌జైల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ శ్రవణ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కొత్తగా అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సిఆర్‌పిసి స్థానంలో వచ్చిన భారతీయ నాగరికత సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో వచ్చిన భారతీయ సాక్షి అధినేయం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కొత్త చట్టాల ప్రకారం నేరం ఎక్కడ జరిగినా ఏ పోలీస్‌స్టేషన్‌లో నైనా ఫిర్యాదు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కొన్ని సెక్షన్లకు శిక్షలు కూడా పొడిగించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో ప్యానల్ న్యాయవాదులు అత్తిలి ప్రభూజి, మడికి రాంబాబు, వనపర్తి మూర్తి, కందుల వెంకటాచలం, పిఎల్‌వి, కొమ్మోజు లక్ష్మి పాల్గొన్నారు.



పోలీసులు గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్‌కళ్యాణ్

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పిఠాపురం, జగ్గంపేట

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌కు జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. సోమవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు హైవే పక్కన ఉన్న ఆయన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పి ఎస్.సతీష్‌కుమార్, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఎఫ్ఒ ఎస్.భరణి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్ఎన్.వర్మ, ఇతర అధికారులు, నాయ కులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే మధురపూడి విమానాశ్రయం నుంచి పిఠాపురం వెళ్లే క్రమంలో జగ్గంపేటకు వచ్చిన పవన్‌కు జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

రైస్ మిల్లర్లకు పూర్తి సహకారం : చినరాజప్ప

ప్రజాశక్తి - కాకినాడ



రామకృష్ణను అభినందిస్తున్న ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప

గత ప్రభుత్వంలో రైస్ మిల్లర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అటువంటి ఇబ్బందులు తమ ప్రభుత్వంలో ఉండవని, పూర్తి సహకారాన్ని అందిస్తామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం సామర్లకోట మండలం వేట్లపాలెంకు చెందిన నున్న రామకృష్ణ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రైస్ మిల్లర్ అసోసియేషన్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైస్ మిల్లర్ల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. తమ ప్రభుత్వంలో వారి నిరంతర అభివృద్ధి కోసం తాము పని చేస్తామన్నారు. రైతు బాగు కోసమే టిడిపి అనేక పథకాలను అందిస్తుందని చెప్పారు. జిల్లాలో ఉన్న పెద్ద స్థాయి మిల్లర్లు అందరూ చిన్న మిల్లర్లను ఆదుకోవాలని అన్నారు. అందుకు తాము సహకరిస్తామని చెప్పారు. నున్న రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రెండో పంట మధ్యలో ఉందని, బొండాలు రకం బస్తా రూ.1500 నుంచి రూ.1700 కొనుగోలు చేసేందుకు నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఘనంగా సత్కరించారు. మిల్లర్స్ కార్యాలయ భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీను, కార్యదర్శిగా మొగిలి అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా కొత్త బైరవకృష్ణ , కోశాధికారిగా పెద్దిరెడ్డి బాబ్జి, జిల్లా మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు అంబటి రామకృష్ణారెడ్డి, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

హుండీల ద్వారా రూ.33.82 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మండలంలో ఉన్న తిరు పతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా రూ.33,82,477 ఆదాయం సమకూరిందని కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 103 రోజులకు సంబంధించి హుండీలను ఎంఎస్ఎన్ చారిటీస్ కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌బి.చందన, దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు, కాకినాడ సంత చెరువు కనకదుర్గమ్మ ఆలయ ఇఒ జోకా సత్యనారాయణల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరిపారన్నారు. సాధారణ హుండీల ద్వారా రూ.26,97,425, అన్నదాన హుండీల ద్వారా రూ.6,85,052 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, అర్చకులు పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - జగ్గంపేట



పేదల ఆకలి తీర్యేందుకే అన్న క్యాంటీన్ టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కోడలు జ్యోతుల లక్ష్మి అన్నారు. జగ్గంపేటలో ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం నిర్వహించే అన్న క్యాంటీన్‌లో లక్ష్మి తండ్రి చెక్కపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయంతో నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమారుడు అనీస్ నెహ్రూ, ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, బచ్చుల సుధీర్, పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ సభ్యులు, ఎపిఆర్‌సి ఫుడ్స్ అధినేత కట్టా అప్పారావు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి నిస్సహాయ స్థితిలో ఉన్న పేద వృద్ధులు, మహిళలకు భోజన క్యారేజీలు అందించారు. ఈ సందర్భంగా దాత అప్పారావును లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన దాట్ల సుబ్బరాజు జల్లావారి పేటలో పేద వృద్ధురాలికి భోజన క్యారేజీని అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బి. శ్రీనివాసరెడ్డి, పొన్నాడ పేరయ్య రాజు, కట్ట ఆదినారాయణ, నడింపల్లి వినోద్, సతీష్‌రాజు, రాయపరాజు, నున్న దత్తు, సామ భగవాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - శంఖవరం

శంఖవరం గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు ఎంపిడిఒ విజయకుమార్‌ను కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వారు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పంచాయతీలో డ్రెయినేజీల్లో ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని, దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కళాజాతా

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, డయేరియాపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కళా జాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ పూర్ణిమ పాల్గొని మాట్లాడారు. బాలికలను చదివిద్దాం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అనంతరం కళాజాతా బృందం చక్కని నాట్య రూపంలో ప్రజలకు అర్థమయ్యేలా బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

'శ్వేతపత్రం విడుదల చేయాలి'

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలో గత ప్రభుత్వంలో ఖర్చు చేసిన నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్, కాజులూరు పంచాయతీ, స్త్రీ శక్తి కార్యాలయాలను కూటమి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజులూరు పంచాయతీలో అనేక అవకతవకలు జరిగినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి ఆదేశాలకు అనుగుణంగా పనిచేయడంతో అవకతవకలు జరిగాయని, డ్వాక్రా యానిమేటర్ సైతం అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై అధికారులు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సహకార సంఘ మాజీ అధ్యక్షులు యాళ్ళ వెంకటరమణ, కాదా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో టోల్‌ఫ్రీ నెంబర్

ప్రజాశక్తి - కాకినాడ

తాగునీటి సంబంధ సమస్యలు, వీధిదీపాలు, పారిశుధ్యం, డయేరియా మొదలగు సీజనల్ వ్యాధుల పరిష్కారానికి నిరంతరాయంగా 24 గంటలూ పనిచేసేలా టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎదురయ్యే డయేరియా వ్యాధులతోపాటు రోజువారి సమస్యలైన విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, కాల్వల శుభ్రత సహా ఆయా సమస్యలపై నేరుగా టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత విభాగాలు ద్వారా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4255 990కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు.